నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, గురువారం 27 ఫిబ్రవరి 2025 | YADADRI BHUVANAGIRI




భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

# టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికకు నేడు పోలింగ్

## ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు

- 12 జిల్లాల పరిధిలో 200 పోలింగ్ కేంద్రాలు
- మొత్తం 25,797 మంది ఓటర్లు
- బరిలో 19 మంది అభ్యర్థులు
- ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది
- పోలింగ్ ముగిశాక బ్యాలెట్ బాక్స్‌లన్నీ నల్లగొండ స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపు
- పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు : ఆర్ఓ ఇలా త్రిపాఠి

**వరంగల్ -ఖమ్మం- నల్లొండ శాసన మండలి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. బుధవారం సాయంత్రమే ఆయా జిల్లా కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సిబ్బంది సామగ్రితో కలిసి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ మొదలుపెట్టి 8 గంటల వరకు సర్వం సిద్ధంగా ఉంటారు. మొత్తం 12 జిల్లాలో పరిధి లోని 191 మండలాల్లో విస్తరించి ఉన్న నియోజకవర్గంలో 200 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ పట్టణాలతోపాటు ఓటర్ల సంఖ్యను బట్టి ఆయా మండల కేంద్రాల్లో మాత్రమే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గురువారం పోలింగ్ ముగిశాక అన్ని జిల్లాల నుంచి పోలింగ్ బాక్స్‌లన్నీ నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్జాలబావి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాముల్లోని స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలిస్తారు. అక్కడే ప్రత్యేక పోలీసు బందోబస్తు మధ్య సీసీ కెమెరాల నిఘాలో వీటిని భద్రపరుస్తారు. వచ్చే నెల 3వ తేదీన కౌంటింగ్ కూడా ఇక్కడే జరుగనుంది.**

– నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ)



నల్లగొండలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రి సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

### ఓటర్ల ప్రసన్నం కోసం...

ఉపాధ్యాయ నియోజకవర్గంలో మొత్తం 19 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. యూటీఎఫ్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీఆర్‌టీయూ–టీఎస్ నుంచి పింగిళి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ నుంచి పులి సర్వోత్తంరెడ్డి, బీసీ సంఘాల మద్దతుతో టీచర్స్ జాక్ నుంచి మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ ఎస్. సుందర్‌రాజ్, ప్రజావాణి పార్టీ నుంచి లింగిడి వెంకటేశ్వర్లు, స్వతంత్ర అభ్యర్థులుగా అర్వ స్వాతి, కంటె సాయన్న, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, గోపాల్‌రెడ్డి పన్నాల, ఏలె చంద్రమోహన్, చాలిక చంద్రశేఖర్, జంగిటి కైలాసం, జె.శంకర్, తలకోల పురుషోత్తంరెడ్డి, తాటికొండ వెంకటరాజయ్య, దామెర బాబురావు, బంక రాజు అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు. ఇందులో ప్రధాన సంఘాలకు చెందిన ఐదారుగురు గెలుపుపై ధీమాతో సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రతి ఓటరును కలిసే ప్రయత్నం చేశారు. యూటీఎఫ్ మినహా మిగతా ప్రధాన అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు చివరి వరకు ప్రయత్నాలు కొనసాగించారు.

### మొత్తం ఓటర్లు 25,797 మంది

ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధిలో మొత్తం 25,797 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్లలో పురుషులు 15483 మంది, మహిళలు 10314 మంది ఉన్నారు. అత్యధికంగా హన్మకొండ, తర్వాత నల్లగొండ, ఖమ్మం జిల్లాలో ఓటర్లు ఉన్నారు. అతి తక్కువగా సిద్దిపేట జిల్లా(4 మండలాలు)లో 168 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఇక ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 8,331 మంది ఓటర్లు ఉండగా అందులో నల్లగొండ జిల్లాలో 4,683 మంది, సూర్యాపేట జిల్లాలో 2,664 మంది, యాదాద్రి జిల్లాలో 984 మంది ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ నిర్వహణ కోసం 752 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల ఆవరణలో టెంట్స్, సరైన లైటింగ్, బయట మెడికల్ టీమ్స్ లాంటి మౌలిక వసతులు కూడా కల్పించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ కూడా అమలులో పెట్టారు.

### జాగ్రత్తగా ఓటేయాల్సిందే.

కిందటిసారి 2019 మార్చిలో వరంగల్–ఖమ్మం–నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలు జరిగాయి. మొత్తం 18,885 ఓట్లు పోలు కాగా అందులో 18,027 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. అంటే 858 ఓట్లు చెల్లకుండా పోయాయి. ఇలా చెల్లని ఓట్లతో మొదటి ప్రాధాన్యత ఓట్లలోనే తేలాల్సిన ఫలితం రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు వరకు వెళ్లింది. వాస్తవంగా గత ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓట్లలో మరో 38 వచ్చి ఉంటే యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి అక్కడే గెలిచి ఉండేవారు. కానీ చెల్లని ఓట్ల సంఖ్య గణనీయంగా ఉండడంతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు లెక్కించాల్సి వచ్చింది. ఇక ఇదే తరహాలో 2013 మార్చిలో జరిగిన ఎన్నికలోనూ చెల్లని ఓట్ల సంఖ్య ఎక్కువగానే ఉంది. అందుకే నేడు జరుగబోయే పోలింగ్‌లోనూ ఎన్నికల నిబంధనలపై గురువు స్థానంలో ఉన్న ఓటర్లు పూర్తి అవగాహనతో ఓటింగ్ వెళ్లాల్సిందే. ఓటు వేసే సమయంలో ప్రతి ఓటరు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయడం తప్పనిసరి. ఓటు వేసే క్రమంలో ఎక్కడా కూడా ప్రాధాన్యత క్రమం తప్పకుండా చూసుకోవాలి. ఓటు వేసేటప్పుడు కచ్చితంగా ఇంగ్లిష్ లేదా రోమన్ అంకెల్లో ఓటు వేయవచ్చు. ఇందులోనూ రోమన్ అంకెల కంటే ఇంగ్లిష్ అంకెల్లో ఓటు వేయడమే చాలా సులువు. అందుకే ఇంగ్లిష్ అంకెలుగా పిలవబడే '1,2,3,4,5,.... 19' వరకు ప్రాధాన్యతలు ఇస్తూ వెళ్లవచ్చు. ఇలా అంకెలు కాకుండా 'ఒకటి, రెండు, మూడు, నాలుగు.... పందొమ్మిది'' ఇలా అక్షరాల్లో రాస్తే ఓటు చెల్లదు. ఇక ఇవి కాకుండా రైట్ లేదా ఇతర గుర్తులు, చిహ్నాలు ఇవేవీ బ్యాలెట్ పేపర్ పైన రాసినా అవి కూడా చెల్లని జాబితాలోకే వెళతాయి. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లకు ఎదురుగా వారి ఫొటో ఆ తర్వాత ఓటు వేసేందుకు ఒక బాక్స్ ఉంటుంది. ఆ బాక్స్ మధ్యలోనే స్పష్టంగా అర్థమయ్యేలా తమ ప్రాధాన్యత ఓటును అంకెల్లో రాయాలి.



పిల్లలమర్రి శివాలయంలో లింగానికి కుటుంబ సభ్యులతో కలిసి అభిషేకం చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# హరహర మహాదేవ.. శంభో శంకర

## ఉమ్మడి జిల్లాలో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు



రామగిరి, ఫిబ్రవరి 26 : మహా శివరాత్రి వేడుకలు ఉమ్మడి నల్లగొండ వ్యాప్తంగా బుధవారం వైభవంగా జరిగాయి. ఆలయాల్లో శివలింగాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పలుచోట్ల పార్వతీ పరమేశ్వరుడి కల్యాణోత్సవాలు చేపట్టారు. స్వామివారి దర్శనానికి ఆలయాలకు భక్తులు బారులుదీరారు. ఉపవాసాలు, జాగరణతో పరమ శివుడిని కొలిచారు. శివ నామస్మరణ, భక్తి పాటలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పలు ఆలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పూజలు చేశారు.

### ఈ శివరాత్రి నుంచైనా పాలకుల్లో మార్పు రావాలి

- ఎస్ఎల్‌బీసీ ఘటనపై త్వరగా క్లారిటీ తీసుకురావాలి
- మాజీ మంత్రి గుంటండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : ఈ శివరాత్రి నుంచైనా పాలకుల్లో మార్పు రావాలని, ఇకనైనా ఈ ప్రభుత్వం ఐక్యతతో, అవగాహన పెంచుకొని అభివృద్ధి పాలన సాగించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా సూర్యాపేట పట్టణ పరిధి పిల్లలమర్రి శివాలయాల్లో ఆయన తమ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ ఘటనపై త్వరగా క్లారిటీ తీసుకురావాలని, దీనిపై ప్రభుత్వం త్వరగా విచారణ జరిపి బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరిపై శివయ్య ఆశీస్సులు ఉండాలని, భక్తి శ్రద్ధలతో వేడుకలు జరుపుకోవాలని తెలిపారు.



చౌటుప్పల్ శివాలయంలో స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

# నైపుణ్యతే ఉన్నత భవిష్యత్తుకు బాట

## కేఎల్ యూనివర్సిటీలో ఎన్నేండ్లైనా తరగని విద్యా ప్రమాణాలు

- ఇంటర్మీడియట్ తర్వాత సరైన నిర్ణయం తీసుకోకుంటే జీవితంలో ఫెయిల్యూర్
- నిర్ఫ్ ర్యాంకింగ్ బట్టి యూనివర్సిటీ, కళాశాల ఎంపిక చేసుకుంటే మంచిది
- జేఈఈలో 97పర్సంటైల్ దాటితే బీటెక్‌లో ఉచిత విద్యకు అవకాశాలు
- ఎంబీబీఎస్ తర్వాత ఫార్మసీ, అగ్రికల్చర్ బీఎస్సీకే ప్రాధాన్యం
- ఇంటర్ తర్వాత విద్యావకాశాలపై ప్రగతి కళాశాల విద్యార్థులకు వక్తల సూచనలు
- నమస్తే తెలంగాణ-కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహణ
- జేఈఈ, ఎంసెట్, ఎంబీబీఎస్, ఇతర కోర్సులపై అవగాహన వచ్చిందన్న విద్యార్థులు

నల్లగొండ, ఫిబ్రవరి 26 : ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ప్రతి విద్యార్థి జీవితంలో ఎన్నో మలుపులు తిప్పుతుందని చెప్పడంలో సందేహం లేదు. ఇక్కడ విద్యార్థి నిర్ణయం, ప్రవర్తన జీవితం నిలబడాలా లేదా పడేయాలా అనేది తెలుపుతుంది. ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్యావకాశాలపై నమస్తే తెలంగాణ–కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ సంయుక్తంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రగతి బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థినులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ తర్వాత సరైన నిర్ణయం తీసుకోకుంటే జీవితంలో ఫెయిల్యూర్ అవుతుందని, ఇంటర్మీడియట్, మీడియమ్ ప్రోగ్రామింగ్ ఎర్రర్స్‌ను కరెక్ట్ చేసే హైలెవల్ ప్రోగ్రామింగ్ లక్ష్యంగా పెట్టుకొని ప్రతి విద్యార్థి తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటే జీవితం సాఫీగా ముందుకు వెళ్తుందని తెలిపారు. ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ విద్యా విధానం, ఏయే కోర్సుల్లో ఎలాంటి సెటిల్‌మెంట్ ఉంటుంది అనే కోణంలో వివరించడంతోపాటు విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థినులు పాల్గొనగా వారిలో ఇద్దరికి లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందజేశారు. మరో విద్యార్థినికి తన సామర్థ్యాన్ని గుర్తించి ప్రతిభా పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నమస్తే తెలంగాణ బ్యూరో ఇన్‌చార్జి మర్రి మహేందర్ రెడ్డి, ఏడీవీటీ మేనేజర్ శివ కుమార్, స్టాఫ్ ఫొటో గ్రాఫర్ ఆకాశ్, హెచ్‌ఆర్ కిరణ్, అన్వర్ తదతరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థినులకు షీల్డ్ అందిస్తున్న నిర్వాహకులు



### ఉజ్వల భవిష్యత్‌కు పరిపూర్ణ మార్గదర్శి కేఎల్ యూనివర్సిటీ

పరుగెడుతున్న పోటీ ప్రపంచానికి దీటైన వేదికగా.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పరిపూర్ణ మార్గదర్శిగా, యువతకు ఒకే సమయంలో బహుళ డిగ్రీలను అందించే ఏకైక విద్యా సంస్థ కేఎల్ యూనివర్సిటీ. ఇంటర్మీడియట్ తర్వాత జేఈఈ మెయిన్స్‌కు సంబంధించి రెండు సెషన్లుగా పరీక్షలు ఉంటాయి. వాటిల్లో 97పర్సంటైల్ దాటిన విద్యార్థులకు మా యూనివర్సిటీలో ఉచిత విద్యా అవకాశాలు ఉన్నాయి. దేశంలో ఐఐటీల్లో 58వేల సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌లో 99.9పర్సంటైల్ సాధించిన వారికి ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, చెన్నై లాంటి యూనివర్సిటీల్లో సీట్లు వస్తాయి. ఇంజినీరింగ్‌లో ఏఐతో పాటు ఈసీఈ, ఐఓటీ, సైబర్ సెక్యూరిటీ లాంటి కోర్సులు ఉన్నాయి. ఎంబీబీఎస్‌లో సీటు రాకుంటే బీ ఫార్మసీ, అగ్రికల్చర్ బీఎస్సీకి కూడా మంచి భవిష్యత్ ఉంది. దేశంలో 1,208 కళాశాలలు ఉంటే వాటిల్లో 452 కళాశాలలకు మాత్రమే న్యాక్ గుర్తింపు ఉంది.

**- కిశోర్ బాబు, డీన్, కేఎల్ యూనివర్సిటీ**

### మల్టీ డిసిప్లేనరీ ఇంజినీరింగ్ అనేదే ప్రాధాన్యం



ఏదైనా ఒక వస్తువు తయారీలో ఒక్కరే కాకుండా పలువురు ఇంజినీర్ల పాత్ర ఉంటుంది. ఆ వస్తువు తయారు చేసే క్రమంలో వినియోగించే ప్రతి దానిపై అవగాహన కలిగి ఉండటమే మల్టీ డిసిప్లేనరీ ఇంజినీరింగ్. ఇది ప్రతి ఒక్కరూ ఫాలో కావాలి. కింది స్థాయిలో ఉన్న ఇంజినీర్లు చేసే తప్పులు సరిచేసే ప్రోగ్రామర్స్‌కు కోట్ల రూపాయల్లో ప్యాకేజీలు ఉంటున్నాయి. ఇంటర్మీడియట్ తర్వాత ప్రతి విద్యార్థి ఇంజినీరింగ్ విద్యతోపాటు ఎంబీబీఎస్‌లో నైపుణ్య స్కిల్స్ నేర్చుకుంటేనే మనుగడ ఉంటుంది. నేడు ఏఐ టెక్నాలజీ మనిషి జీవితాన్ని ఎన్నో మలుపులు తిప్పుతుంది. ఏఐ మనిషి చేసే విధంగా ఏనాడూ చేయలేదు. దాన్ని మించిన సామర్థ్యాన్ని కలిగి ఉంటేనే మనకు సమాజంలో గొప్ప గుర్తింపు ఉంటుంది. భాష, సిలబస్ అనేవి ఎన్ని ఉన్నా నేను చేయగలను అనే నమ్మకం ఉండాలి. నిర్ఫ్ ఇచ్చే ర్యాంకింగ్ బట్టి విద్యార్థులు కళాశాలలు ఎంపిక చేసుకోవాలి.

**- డాక్టర్ షన్ముఖ కుమార్, కేఎల్ యూనివర్సిటీ**

### ఇంజినీరింగ్ వాళ్లు సీఎస్‌పైనే దృష్టి సారిస్తున్నారు



ఇంజినీరింగ్ విద్యార్థులు కాలానుగుణంగా డిమాండ్ ఏర్పడ్డ సీఎస్‌పైనే దృష్టి సారించి ఏఐఎమ్ఎల్ కోర్సును కోరుకుంటున్నారు. ఏఐ మనిషి జీవితాన్ని ఎన్నో మలుపులు తిప్పుతుంది. విద్యార్థులు ఇంటర్మీడియట్ తర్వాత ఐఐటీ, నిట్, ట్రిపుల్ ఐటీ లేదా ఎంసెట్‌లో మంచి ర్యాంకు కొట్టిన తర్వాత యూనివర్సిటీ, కళాశాల ఎంపికతో పాటు ఆ కళాశాలలో ఫ్యాకల్టీ సామర్థ్యాన్ని బట్టి జాయిన్ అయితే మంచి భవిష్యత్ ఉంటుంది. వీటిపై ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్‌లోనే అవగాహన కలిగి ఉండాలి.

**- శశిధర్ రావు, ప్రగతి కళాశాల డైరెక్టర్**

### ప్రవేశ పరీక్షలపై అవగాహన కలిగి ఉండాలి



ప్రాథమిక విద్య నుంచి ఇంటర్మీడియట్ వరకు సాధారణ విద్య ఉండగా ఇంటర్మీడియట్ తర్వాత మొత్తం ప్రవేశ పరీక్షలపైనే విద్యా విధానం ఆధారపడుతుంది. ఈ ప్రవేశ పరీక్షలతోపాటు ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షలపైనా దృష్టి సారించాలి. ప్రవేశ పరీక్షల అనంతరం మంచి కళాశాలను ఎంపిక చేసుకోని జాయిన్ అయితే అనుకున్న లక్ష్యాన్ని సాధించొచ్చు. కాలానుగణంగా కొత్త కోర్సులు టెక్నాలజీకి అనుగుణంగా విద్యలో భాగమైతున్నందున వాటిని అవపోసన పట్టి తమ సామర్థ్యాన్ని పెంచుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

**- చందా శ్రీనివాస్, ప్రగతి కళాశాల డైరెక్టర్**

### టెక్నికల్ -నాన్ టెక్నికల్ కోర్సుల ప్రాధాన్యతపై అవగాహన వచ్చింది



ఇంటర్మీడియట్ తర్వాత ఇంజనీరింగ్ విద్యలో అందరు టెక్నికల్ కోర్సులపైనే దృష్టి సారిస్తారు. అయితే టెక్నికల్ కోర్సులతో పాటు నాన్ టెక్నికల్ కోర్సులు ఏంటి..వాటి వల్ల ఉపయోగమేంటి అనే కోణంలో వివరిస్తూ అవగాహన పర్చటం బాగుంది. నాన్ టెక్నికల్ కోర్సులపై నాకు ఇప్పటి వరకు పెద్దగా అవగాహన లేదు. ఈ రోజుతో పూర్తిగా వాటిపైనా అవగాహన వచ్చింది. అయితే ఇంటర్ తర్వాత ప్రతి విద్యార్థికి ఉన్నత చదువులపై అవగాహన అవసరం ఉండాల్సి ఉంది.

**- పోరెడ్డి మహిత, ఎంపీసీ విద్యార్థిని**

### బైపీసీతో ఎంబీబీఎస్ తప్ప వేరేది ఉపయోగపడదనే భావన ఉండేది



బైపీసీ చేస్తున్నామంటే ఎంబీబీఎస్ చేయాలనే తపన ప్రతి విద్యార్థికి ఉంటుంది. ఎంబీబీఎస్ సీటు కొట్టడం ఎంత కష్టమో, దానికి ఖర్చు పెట్టడం కూ డా అంతే కష్టం. ఎంబీబీఎస్ రాకున్నా ఫార్మసీ రంగంతో పాటు అగ్రికల్చర్ బీఎస్సీ ద్వారా విద్యార్థులకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయనేది నాకు ఇప్పటి దాకా అవగాహన లేదు. ఎల్ఎల్‌బీ, ఐఏఎస్ లాంటి వాళ్లు సైతం అగ్రికల్చర్ రంగం నుంచి వచ్చారంటే సంతోషంగా ఉంది. ఈ ప్రోగాం నాకు చాలా ఉపయోగపడింది.

**- సిరి, బైపీసీ విద్యార్థిని**

### ఇంటర్మీడియట్ విద్య తర్వాత పూర్తి భిన్నం



విద్యా విధానంలో ఇంటర్మీడియట్ వరకు ఒక భాగమైతే ఆ తర్వాత మరో భాగంగా చూడాలి. ఇంటర్ తర్వాత విద్యా విధానం పూర్తి భిన్నంగా ఉంటుంది. ఇంజినీరింగ్‌తోపాటు వైద్య విద్యలో కోర్సులు భిన్నంగా ఉంటాయి. ఆయా విభాగాల్లో అనేక కోర్సులు ఉన్నందున వాటి ప్రాధాన్యత ఏంటి, విద్యార్థుల ప్రతిభ ఏంటి అనే కోణంలో కోర్సు ఎంచుకొని ముందుకు సాగాలి. భవిష్యత్‌లో మంచి పొజీషన్‌లో ఉండాలంటే ఇంటర్ తర్వాత తీసుకునే స్టెప్ బాగుండాలి.

**- తవిటి మహేందర్, బ్రాంచ్ మేనేజర్, నమస్తే తెలంగాణ**



అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

### ప్రభుత్వాలే ఇలాంటి బాధ్యతలు తీసుకోవాలి

ఇంటర్మీడియట్ తర్వాత కెరీర్ గైడెన్స్ అనేది చాలా ప్రాముఖ్యం. కొందరి ఇండ్లల్లో చదువుకోని వారు ఉండి వారి పిల్లలను చదివిద్దామంటే చెప్పేవాళ్లు ఉండరు. అలాంటి వారికి కెరీర్‌పై అవగాహన ఉండదు. ఈ కెరీర్ గైడెన్స్ విషయంలో ప్రభుత్వాలే బాధ్యత తీసుకొని అవగాహన కల్పిస్తే బాగుంటుంది. కేఎల్ యూనివర్సిటీతో పాటు నమస్తే తెలంగాణ దిన పత్రిక వాళ్లు ముందుకు వచ్చి ఈ సదస్సు పెట్టి అవగాహన కల్పించినందుకు ధన్యవాదాలు.

**- ఎస్ సుష్మ, బైపీసీ విద్యార్థిని**



### కెరీర్ గైడెన్స్ అనేది చాలా అవసరం



సాధారణంగా ప్రాథమిక విద్య నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి విద్యార్థికి అవగాహన ఉంటుంది. ఇంటర్మీడియట్ తర్వాత సబ్జెక్టుల వారీగా కోర్సుల ప్రవేశం ఉంటున్నందున ప్రతి కన్ఫ్యూజన్ ఏర్పడుతుంది. ఇలాంటి సమయంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన నిర్వహించడం సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమంతో నేను ఎంపీసీ తర్వాత నా ఆసక్తిని బట్టి ఏ కోర్సు చేయాలనే అవగాహన వచ్చింది.

**- ఎస్.అక్షయ, ఎంపీసీ విద్యార్థిని**